ఏ యెండకా గొడుగు

పట్టడమే ప్రయోజకత్వం!

# ఆత్మశోధన వేళ ఆర్భాట పటలి

"ఉత్తర"

ఆగస్టు పదిహేను ఆఫీసుకు శెలవు-ఆనాడు ఎంతసేపుదాకా పడుకున్నా అడిగేవాడు లేడుగదా, హాయిగా తొమ్మిదివరకూ లేవకుండా నిద్రపోదామనే సంకల్పంతో పడుకున్నాను వెనకటి రాత్రి. కాని అదేమి విధివిలాసమో- ఆవేళ ఆరున్నరకే మెలకువ వచ్చేసింది. అందుకు కొంతవరకూ కారణం మా చెల్లెలు సరళా, మా దేవేరి రుక్కు అని చెప్పవచ్చును. లోపలింట్లో వదినా మరదళ్ళిద్దరూ ఏమేమో చెప్పుకుంటూ ఉన్నట్టుండి ఉవ్వెత్తుగా నవ్వుకుంటున్నారు. ఆ హాస తరంగాలు నా గదిలోకి చొరుచుకు వచ్చి నిద్రలో ఉన్న నన్ను గిలిగింతలు పెట్టి లేపాయి. కారణం తెలియకపోయినా వాళ్ళతో కలిసి నాకూ నవ్వాలనిపించింది గాని, అనుకున్నట్టుగా నిద్రపోకుండనే మెలకువ తెప్పించారని కొంత ఉడుకుబోతుతనంకూడా వచ్చింది. ఏమైనాసరే అప్పుడే పక్కమీదనుంచి లేవ వద్దనుకుని వస్తూన్న నవ్వు పెదవులపైనే ఆపేసి, జారిన దుప్పటి పైకి లాక్కుని గట్టిగా కళ్లు మూసుకుని పడుకున్నాను. మరి పది నిముషాల తర్వాత మా గృహిణీమణి 'సరళా! నేను స్నానం చేసి వస్తాను. మీ అన్నయ్యను లేపమ్మా' అనడం స్పష్టంగా వినపడింది. ఆ స్వరంలో పరిహాసం ప్రస్ఫుటమవుతూవుంది.

'అన్నయ్యా, అన్నయ్యా' అంటూ సరళ గుమ్మం దగ్గిరకి వచ్చింది. అది రావడం క్రీగంట చూసి 'ఆస్ట్రిచ్చి' లాగ తలగడాల్లో తల దూర్చేసుకున్నాను. అదిమాత్రం నా చెల్లెలు కాదు కనుకనా, నా సంగతంతా పసికట్టేసింది. నవ్వుతూ 'అన్నయ్యా ఇంక లే అన్నయ్యా ఏడు గంటలుకూడా అవుతోంది' అంది.

'ఏడు గంటలవుతూంటే గడియారం రెండు గంటలు వెనక్కి తిప్పు' అంటూ ఇటునించి అటు ఒత్తిగిల్లాను.

'అదేమిటీ! గడియారం వెనక్కి తిప్పడ మెందుకు?'

'ఎందుకేమిటి, నీ మొహం. కాలాన్ని గెలవడానికదే మార్గం. సూర్యుడి గుర్రాలు చురుగ్గా ముందుకుపోతూన్నా గడియారం ముల్లు వెనక్కి జరిపితే అది చూసి సంతృప్తితో సుఖంగా మరి రెండు గంటలు కలలు కంటూ కదలకుండా నిద్రపోవచ్చును. కావల్సిస్తే ఏ కాంగ్రెసువాలానైనా అడుగు. నే చెప్పిందే అసలైన పద్ధతనీ, దాన్నే అక్షరాలా అమలు జరుపుతున్నామని అంటాడు' అన్నాను ఆవులిస్తూ.

ప్రక్కగదిలో గాజులు గలగల మన్నాయి. 'సరళా' నా స్నానమైపోయింది. చీరకూడా కట్టుకుంటున్నాను, మీ అన్నయ్యగారిని చప్పున లేచిరమ్మని చెప్పమ్మా' మా రాణీ సాహేబా వారి ఆజ్ఞ అది.

నేను ఒళ్ళు విరుచుకుంటూ 'సరే మీ వదిన గారు స్నానంచేసి చీర కట్టుకుంటూన్నందుకు చాలా సంతోషం. కాని వారు చీర సింగారిస్తూ ఉంటే నేను చప్పున లేచి రావడం దేనికే సరళా? చీర కుచ్చెళ్ళు సర్దాలా?' అన్నాను.

గదిలో ఈమాటు నవ్వు కిలకిల. 'ఆ, ఏం సెక్కెంగా ఉంది! ఎంత లోకువైపోయాం! సరే కానిండి మాట తీర్చుకునే సమయం రాక పోదులెండి సరళా, శ్రీవారు నాకెప్పుడేం చీర కుచ్చిళ్లూ సర్దక్కర్లేదు. సిగలో పువ్వులూ తుర మక్కర్లేదు గాని ఫ్లాస్కులో పోసిన కాఫీ తాగి చాలా మంచివారుట కుంపటిమీదున్న కూర కాస్త బాగా వేగగానే దింపెయ్యమని చెప్పాదూ ఉప్పూ కారం దానిలో వెయ్యవల

లవన్నీ వేశాను, అవి పూర్తిగా అయేదాకా నే ఉంటే, పుణ్యకాలం రవ్వంతా మించిపోతుంది.'

'అవునవును. ఇంకా ఆలస్యమైతే లాభం లేదు. ఏడున్నరకే ఊరేగింపన్నారు. ఈ పాటికి బయలుదేరుతూ ఉంటారు. మనల్ని తప్పకుండా రమ్మని నిన్న నొక్కినొక్కి చెప్పారుకూడాను. లే అన్నయ్యా మేం వెళ్ళాలి.'

మా సరళ లేమ్మనకముందే ఊరేగింపు మాట వినగానే, దిగ్గునలేచి పక్కమీద కూర్చున్నాను. 'ఏమిటీ? ఊరేగింపా? ఎవరికి పెళ్ళి?' అన్నాను.

'పెళ్ళీ లేదు; పేరంటమూ కాదు. మా సమాజంవాళ్లు, ఇవాళ ఊరేగింపులూ, ఉత్సవాలూ ఇత్యాదులు బ్రహ్మాండంగా జరపాలని పెద్దలు నిర్ణయించారట' ప్రక్క గదిలోనించి బైటకు వస్తూ జవాబిచ్చింది రుక్కు.

'ఎవరో ఆ పెద్దలు?'

'దేశోద్ధారకులైన పూర్వనాయకులు.'

'పూర్వనాయకులంటే అర్థం?'

'పూర్వసువాసినులంటే అర్థం ఏమిటో పూర్వనాయకులన్నా అదే.'

'భేష్! అయితే పూర్వనాయకులకి మీ సమాజానికీ ఏం సంబంధం?'

'పూర్వనాయకులవడమే ప్రథమసంబంధం. అదీగాక పెద్దబుర్ర లేకపోతే, ఎద్దు బుర్రయినా నిలపాలన్నారు దేనికైనాను. అందుకని, మొదటి నుంచీ కనిపెట్టుకుని ఉన్న బుర్రకే పెద్దరికం ఇస్తున్నాం.'

'బాగుంది. చాలా తెలివైనపని. సరే కాని, మనలో మనమాట దేనికి ఇప్పుడీ సంబరాలు?'

ఈ మాట మా సరళ అందుకుంది. 'అబ్బా అదేమిటన్నయ్యా ఏమీ తెలియనట్టడుగుతావు? ఈవాళ ఆగస్టు పదిహేను కాదూ? స్వరాజ్యం స్వతంత్రంవచ్చి మూడేళ్ళవుతుంది. స్వాతంత్ర్య దినోత్సవం చెయ్యవద్దూ?'

నాకు ఏడవాలో నవ్వాలో తెలియలేదు. అన్నానేగాని, నిజానికి నాకు నవ్వున ఏడుపు రాదు. అందులోనూ ప్రొద్దున్నే అసలేరాదు. 'ఏడిచి సాధించాలని' ఎప్పుడేనా ప్రయత్నించినా మధ్యలో నవ్వు వచ్చేస్తుంది. అందుచేత చిరునవ్వుతో 'అలాగా? స్వతంత్రం వచ్చిందా? ఎవరికి వచ్చింది? దేనికి వచ్చింది? ఈ మూడేళ్ళలోనూ, ఏ విశేషాలు పెరిగాయని ఈ మహదుత్సవాలు?' అని అడిగాను.

మా చెల్లెలు వాళ్ళ వదిన వేపు చూసింది. మా శ్రీమతి స్వతహాగానే సిసింద్రీ, ఊరికేనే లంకాపురి నాలుగు మూలలూ అంటిస్తుంది. ఈ పాటి రెచ్చగొట్టి ఊపిచ్చి వదలితే ఇక చెప్పాలా?

ఉబికుబికి వస్తూన్న నవ్వునీ ఉక్రోషాన్నీ, పెదవులమీదే, లోనే అపుకుంటూ, ఉపన్యాసం ఆరంభించింది:

'చాల్లెండీ, మీ చెప్పడమూ ఇంతే, కావాలని ఏవో అనర్థకం ప్రశ్న వేసి, రెచ్చగొట్టి వాగిస్తారు నన్ను. పండితులూ,సర్దారులూ అంతా కలిసి, శ్వేతద్వీపంనుంచి స్వరాజ్యం ముక్కలు ముక్కలుగా చేసి తేలేదూ మూడేళ్ళక్రిందట! 'స్వరాజ్యం గురుణా దత్తం' అని ఆ పెద్దలు తెచ్చిన రాజ్యం, అప్పటినించీ అగస్త్యభ్రాతలంతా ఎవ్వరేమన్నా లక్ష్యపెట్టకుండా ఏకధాటిగా ఏలేస్తున్నారు కాదూ? రాజ్యచక్రమే కాకుండా కాలచక్రం కూడా వెనక్కి తిప్పాలని విపరీత ప్రయత్నాలు జంకూ గొంకూ లేకుండా చేస్తున్నారే!

'స్వరాజ్యం రాగానే ఎంచక్కా ఎన్నిటికో స్వతంత్రం వచ్చింది. అథం శుభం ఎరగని అమాయిక ప్రజలకి అరచేతిలో వైకుంఠ మెరిగిస్తామని వాగ్దానాలు చేస్తూ, మన దేశంలోని మాయలమరాఠీలే, మన దేశంలోని మందబుద్ధులైన అసమర్థులే అధికారాన్ని చేజిక్కించుకునేందుకు స్వతంత్రం వచ్చింది (ఎదురయ్యేది వైకుంఠమో కాదో తెలియదుగాని, వారానికి మూడు రోజులు ఉపవాసాలు చేయిస్తూ మరోలోకాన్ని చేరువ చేస్తున్నారు!) జాతి మత విభేదాలుండరాని 'సెక్యులర్ స్టేటు'లో నిరంకుశంగా కుల విభేదాలు పాటించడానికి స్వతంత్రం వచ్చింది; నిశ్చింతగా విద్యాభివృద్ధిని అరికట్టడానికి స్వతంత్రం వచ్చింది; నిరుద్యోగ సమస్యని నిర్లిప్తతగా వదలి వేయడానికి స్వతంత్రం వచ్చింది; నిర్మొగమాటంగా ఎదురాడిన వారం

దరిని విప్లవకారకులుగా నిరూపించి జైలులో పెట్టడానికి, దేశవిద్రోహులుగా గుండేసి కొట్టడానికి స్వతంత్రం వచ్చింది; ప్రభుత్వం ఏం చేసినా సంపూర్ణ సహకారం చూపడం ప్రజల విధి అని, నిశ్చయంగా నీతులు బోధించడానికి స్వతంత్రం వచ్చింది. ఆకలితో మలమల మాడి చావడానికి సామాన్య జనానీకానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చింది!

'అయితే. ఒక్క షరతుమీద: ప్రభుత్వానికి అపఖ్యాతి వచ్చేలాగ రోడ్డుప్రక్కని కాకుండా, గుట్టుగా ఇంట్లోనే చావాలి.'

'నిద్ర మత్తులో మాట మరుపునే అన్నారో, నన్ను కవ్వించి వినాలనే అన్నారో, గాని ఈ మూడేళ్ళలో మనదేశంలో ఏవి పెరిగాయో నాకు మాత్రం తెలియదా ఏం!

నాయకుల్లో అవినీతీ, ప్రజల్లో అశాంతీ, పట్టపగ్గాలు లేకుండా పెరిగాయి, పంటచేలల్లో ఆకలి, ప్రభుత్వ సౌధాల్లో దాహం, హృదయవిదారకంగా పెరిగాయి. శ్రీమంతుల సిరిసంపదలూ, శ్రమ జీవుల దుఃఖ దారిద్ర్యాలూ, దుర్భరంగా పెరిగాయి. చీకటి బజారుల వింతవైభవాలూ, మధ్య తరగతి వారి కష్టనిష్ఠూరాలూ సమాన నిష్పత్తిలో పెరిగాయి. ఆహార, నిరుద్యోగాది నిత్యజీవన సమస్యలు తలమునిగి నాటి ప్రమాణంగా పెరిగాయి. ఆ సమస్యా పరిష్కారాలకి, ప్రభుత్వ ప్రణాళికలు, వీసెలకొద్దీ బరువుగా బీరువాలనిండా పెరిగాయి. సభ్యతా, సంస్కృతుల నెరుగని, మాజీ మహర్షుల మాతృదేశభక్త్యుల సన్యాసాలు, దేశసంచారాలు చేసి, అలిసిసొలసిపోయిన వృద్ధనారుల గృహిణీ ధర్మోపదేశాలూ, వెలపరం కలిగిస్తూ వెక్కసంగా పెరిగిపోయాయి. ఇంకా, ఇంకా - ఎన్నో! ఎంతకని చెప్పడం?

'మా పెద్దలు ఇవన్నీ గ్రహించారు కనుకనే ఊరంతా ఊరేగి, గొప్పగా ఉత్సవాలు చేసీ పామరప్రజల నేమార్చి, ప్రతిష్ఠ నిలబెట్టనున్నారు. అంతకన్నా దేశాని కింకేంకావాలి?

'మాదీ స్వతంత్ర దేశం, మాదీ స్వతంత్ర జాతీ' అని రేడియోలు రణగొణధ్వనిగా 'గీ' పెట్టేస్తూంటే సరదాగా పట్టుచీరలు కట్టుకుని వీధులంట ఊరేగబోతామంటే అంతగా వెక్కిరించి వేళాకోళం చేస్తారెందుకండీ?' అని ఏక్ దమ్ లెక్చరిచ్చేసి మరీ గుక్క త్రిప్పుకుంది మా రుక్కు.

'అన్నయ్యా! ఊరేగింపు కాగానే పిప్పరమెంట్లు కూడా ఇస్తారుట. పాపనీ, బాబునీ కూడా తీసుకుని పొద్దున్నే రమ్మన్నారు మమ్మల్ని' అని అందించింది సరళ.

'బాగుందమ్మా. ఇంకేం, మధ్యాహ్నం భోజనం ఆలస్యమైనా, అసలే లేకపోయినా కూడా మరేమంత బాధలేదు అయినా. మహా- రోజూ కడుపునిండా తిని అఘోరిస్తున్నారు గనుకనా ప్రజలు! అన్నాను నేను.

'నిజమైన మాట అన్నయ్యా. ఉత్సవాలు చేసుకుంటూ ఉపవాసాలుండటం, ఈ అవకతవక ఆదర్శాల అసందర్భ పాలనకి అతికినట్టుగా సరిపడుతుంది.'

'ఏవమ్మా, సరళా- అన్నా చెల్లెళ్ళిద్దరూ ఆశయాలు కలబోసుకుంటూ కూచుంటే, అవతల సమయం దాటిపోతుంది. ఎండమావుల్లా అడియాసగొలుపుతూన్న స్వతంత్రాన్ని కరుముకుంటూ ఊరేగబోవాలి. చప్పున లేవమ్మా!' అంటూ మరదలి భుజంమీద వాలి విరగబడి నవ్వడ మారంభించింది నా ఉత్తమ అర్థాంగి!

అర్థాంగి నవ్వితే- నాకు మాత్రం నవ్వాగుతుందా?

ప్రజలను ఘోరహింసల పాలు జేసినవారికి, ఆకలి చావులకూ ఆత్మహత్యలకూ కారణమైనవారికి, కడుపు తీపిని మంటగలిపి కన్నబిడ్డలను కట్టెపుల్లలుగా అమ్మే వైపరీత్యానికి దారి చూపినవారికి, ప్రాణానికి ప్రాణమైన శీలాన్ని పట్టెడు అన్నంకోసం అమ్మించినవారికి, చరిత్ర ఎటువంటి శిక్ష విధిస్తుందో? నిజమైన స్వాతంత్ర్య న్యాయస్థానం యెటువంటి తీర్పు చెపుతుందో?—జనవాణి సంపాదకీయం.